లోని వాళ్లంతా పండక్కు కావాల్సిన సరంజామా సమకూర్చుకునేందుకు తమవంతుగా ఏదో ఒకటి ఇస్తామంటూ చేసిన వాగ్దానాలను విన్న పటేల్ కిష్టా.. లోలోపల ఆనందంతో పొంగిపోతూ..

''మీరంత ఇచ్చినైగాక పైఎత్తున ఎంత కర్సు అయితే అంత నేను పెట్టుకుంట తియ్యిరి!'' అంటూ, తన పెద్దరికానికి తగ్గట్టు హుందాగా సెలవిచ్చాడు.

పటేల్ మాటలు విన్న వెజ్జు డోంగా..

''అయితే ఇంకేంది? పండక్కి కావల్సినయన్ని ఒనగూడినట్టే! కాబట్టి అచ్చే పున్నమినాడు మన గుంపంతా కలిసి ఆన్వాయితెమ్మటి గాదెల పండుగ జేస్కుందాం!'' అంటూ తీర్మానాన్ని ప్రకటించాడు.

* * *

పండుగ ఇంకా మూడు రోజులు ఉందనగా, గుంపులోని వాళ్లంతా ఎవరెరు ఏ ఏ వాగ్దానాలిచ్చారో దాని ప్రకారం అందరూ స్వచ్ఛందంగా తీసుకొచ్చి, గుంపు పటేల్ కిష్టా ఇంట్లో ఒప్పజెప్పారు.

పండుగరోజు పొద్దున్నే లేచిన గుంపులోని వాళ్లంతా.. నేరుగా రాళ్లవాగు దగ్గరికి పొయ్యి స్నానాలు చేసి, ఉతికిన బట్టలు కట్టుకొన్నారు. ప్రతివాళ్లూ తమ గుడిసెల్లోని దొంతుల్లో శుద్ధి చేసి దాచుకున్న రకరకాల ఇత్తనపు గింజల్ని గుప్పెడు గుప్పెడు తీసి, మోదుగాకు దొప్పల్లో పోసి ఉంచారు.

ఆవుల మందలను అడవికి విడిచే వేళకు దేవర గద్దె దగ్గరికి చేరిన యువకులు.. ఒక్కసారిగా 'తూత్ కొమ్' (వెండి పొన్నులున్న చిన్న కొమ్ముబూర)తో పరిసరాలు మార్మోగిపోయేలా ఊదసాగారు.

ఆ బూర ధ్వని విన్న గుంపు గుంపంతా ఒక్కసారిగా సంతోషంతో నెమలి పిట్టల మాదిరిగా చిందులు తొక్కుతూ, చిన్నచిన్న వెదురు బుట్టల్లో విత్తనపు గింజలతోపాటు ఇంకా ఏవేవో సామాన్లు సర్దిపెట్టుకొని, తుడుములు కొట్టుకుంటూ ఇండ్ల నుంచి వెలుపలికి వచ్చి.. గుంపు మధ్యనున్న దేవర గద్దె దగ్గరికి చేరుకున్నారు.

అప్పటికే అక్కడ పటేల్, వెజ్జుతోపాటు మరికొందరు గుంపు పెద్దలు గుమిగూడి ఉన్నారు. అన్ని ఇండ్లవాళ్లూ వచ్చారని నిర్ధారణ చేసుకున్న తరువాత కోళ్లు, మేక, పందిగున్న, కల్లు కుండలు, కూర అరటి గెల, కొడవళ్లు, గొడ్డళ్లు మొదలైనవాటిని పట్టుకొని, తుడుం దరువుకు అనుగుణంగా.. ఆడ – మగ, పిల్లలు, యువకులు, వృద్ధులు అన్న తేడాలేకుండా, చిందులు వేస్తూ గుంపు గుంపంతా రాళ్లవాగుకు కూతవేటు దూరంలో ఉన్న పాలచెట్ల వనం వైపుగా కదిలారు.

గట్టిగా నడిస్తే నిండా ఇరవై నిమిషాలు కూడా పట్టని ఆ దూరాన్ని చేరడానికి వాళ్లకు దాదాపు గంటకు పైగానే పట్టింది.

గుంపు వనానికి చేరిన వెంటనే కొంతమంది యువతీ, యువకులు తాము తీసుకుపోయిన కొడవళ్లు, గొడ్డళ్లతో ఓ పెద్ద పాలచెట్టు కింద నిలబెట్టి ఉన్న.. ఏనాటిదో? ఏ అమ్మ తల్లికి ప్రతిరూపమో! తెలియని ఓ శిథిల స్త్రీమూర్తి రాతి శిల్పం చుట్టూ.. మొక్కా, మోడు, చెత్తా చెదారాన్ని నిమిషాల్లో చెలిగి పారేసి, ఆ ప్రాంతాన్నంతా శుభ్రం చేశారు.

అంతలోనే కొంత మంది నడి వయస్కులు కొడవళ్లు తీసుకుని, అక్కడికి కొద్ది దూరంలో గుర్రపు నాడ ఆకృతిలో ఒంపు తిరిగి ప్రవహిస్తున్న రాళ్లవాగు ఒడ్డునున్న ఈతచెట్ల నుంచి ఓ బిర్రు పిడికెడు ఈత మెల్లెల్ని చెలుక్కొచ్చి వెజ్జు ముందు పడేశారు. అతనికి తోడుగా మరి కొంతమంది వృద్ధులు కూడా జతకలిసి, కొడవళ్లు తీసుకుని ఆ ఈత మెల్లెల్ని సన్నగా చీల్చి పక్కన వెయ్యసాగారు.

అంతలోనే మరికొంత మంది.. దేవరకు ఎడమ పక్కన అడుగు కైవారంతో గడ్డపారతో మూడుచోట్ల చిన్నచిన్న గాతాలు వేశారు.




గాతాలు వేసిన వాళ్లు పక్కకు తప్పుకోగానే, మరి కొందరు బొటనవేలి లావుతో, రెండు అడుగుల పొడవుతో ఉన్న పాలచెట్ల కొమ్మల్ని నరుక్కొచ్చి ఆ గాతాల్లో బలంగా గుచ్చి గట్టిగా కూరారు.

ఆ వెంటనే పటేల్, వెజ్జు మరికొంత మంది కలిసి, పాతిన పాలకర్ర ముక్కలను కలుపుతూ.. తడిక అల్లినట్టు అల్లసాగారు. ఐదే ఐదు నిమిషాల్లో చిత్రంగా అవి పూర్వకాలం గ్రామాల్లోని పెద్ద పెద్ద భూస్వాముల ఇండ్లముందు ధాన్యాన్ని నిల్వ ఉంచే గుమ్ముల మాదిరిగా రూపుదాల్చాయి.

అదే సమయంలో మరికొంత మంది కూర అరటి గెల నుంచి కాయలను విడిపించి, కూర వండటం కోసం చక్రాల మాదిరిగా తరిగి, టేకు ఆకుల విస్తళ్ల మీద కుప్ప పోయసాగారు.

మరి కొంతమంది యువకులు గొడ్డళ్లతో ఓ పాల చెట్టు నుంచి నాలుగు బడితెలను, నాలుగు గుంజలను కొట్టుకొచ్చి.. దేవరపైన నాలుగు అడుగుల వెడల్పు, ఐదు అడుగుల పొడవున పందిరి వేశారు. మిగిలిపోయిన మండల్ని ఆ పందిరి మీద కప్పుగా పరిచారు.

ఇంతలో కొంతమంది యువకులు మెడల్లో పెద్దడోళ్లు వేసుకుని, తలల మీద కొమ్ము తలపాగాలు పెట్టుకొని దేవర చెట్టు చుట్టూ గుండ్రంగా తిరుగుతూ ఉంటే.. వారితోపాటు జతగలిసిన కొంతమంది యువతులు ఒకరి నడుముల మీద మరొకరి చేతులు వేసి వలయాకారంలో నిల్చి, వెనక్కి – ముందుకు అడుగులు వేస్తూ.. లేడిపిల్లల్లా చురుగ్గా కదులుతూ, కోకిలల్లా పాడుతూ తమను తాము మరిచిపోసాగారు. వారిని వారు మరిచిపోవడమే కాదు.. వారి నర్తనానికి, గానానికీ పులకించిపోయిన సమీపంలోని చెట్టూ చేమలన్నీ ఒక్కసారిగా స్తంభించిపోయి, వారి దిక్కే చూస్తున్నట్టుగా నిల్చిపోయాయి.

వెజ్జుతోపాటు మరికొందరు వృద్ధులుకూడా కలిసి గాదె దేవరను పసుపు, కుంకుమలతో అలంకరిస్తుంటే.. మరికొంత మంది ఎడంగా వెళ్లి, పొయ్యిని పొందించి, దానిమీద చిన్న రాతెండి సర్వలో అన్నం వండుతూ.. అందులోనే ఐదారు కోడిగుడ్లను కూడా వేశారు. కొంతసేపటికి అన్నం ఉడికిన తరువాత సర్వను దించి కింద పెట్టారు. అన్నంతోపాటే ఉడికిపోయిన గుడ్లను బైటికి తీసి, వాటి మీది పెంకుల్ని పక్కనే ఉన్న రాతి కేసి పగులగొట్టి వలిచి, టేకు ఆకుల విస్తరిలో ఉంచారు. ఆ తరువాత సర్వలోని అన్నాన్ని మొత్తం వేరే విస్తర్లోకి తోడి ఓ పక్కన పెట్టారు.

ఇంతలో ఇద్దరు యువకులు రెండు అరకోడి పుంజుల్ని దేవరముందు కొడవలితో మెడలు తప్పించి.. చితుకుల మంట మీద బూరుతోపాటే కాపి శుభ్రం చేసి, ముక్కలు కొట్టిన తరువాత పొయ్యిమీద కెక్కించిన కూర సట్టిలో వేసి.. పావుగంటలో కూర వండి తీసుకొచ్చి దేవర ముందు ఉంచారు.

అట్లా తయారుచేసిన అన్నాన్ని, కోడికూరను, గుడ్లను దేవర ముందుంచి ధూపం వేసిన వెజ్జు.. సీసాలో పట్టుకొచ్చిన ఇప్పసారాను వారబోసి నైవేద్యం పెట్టి అక్కణ్నుంచి పక్కకు తప్పుకొన్నాడు.

ఆ వెంటనే కొంతమంది పందిగున్నను, మేకపోతును దేవరముందు 'బలి ఇచ్చి' తీసుకుపోయి, వాటిని ముక్కలుగా తరిగేవాళ్లు తరుగుతుంటే.. అన్నం, అరటి కాయ కూర వండేవాళ్లు వండుతూనే ఉన్నారు.